## దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జనవరి 19 : జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యాకవర్గాల సంక్షేమ శాఖ అధికారి దయానంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గురుకులాల్లో 75 శాతం మైనార్టీలకు (ముస్లిం 64 శాతం, క్రిస్టియన్ 7 శాతం, జైన్, పార్శీ, బౌద్ధ, సిక్ 4 శాతం), 25 శాతం నాన్ మైనార్టీ (ఎస్సీ 6 శాతం, ఎస్టీ 4 శాతం, బీసీ 12 శాతం, ఓసీ 3 శాతం) వర్గాలకు చెందిన విద్యార్థులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 6, 7, 8వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు మాత్రమే ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు tmristelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారికి ఆదాయ పరిమితి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించి ఉండకూడదని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

బాన్సువాడ రూరల్, జనవరి 19 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన సాద పవన్ కామెర్ల వ్యాధితో మృతి చెందాడు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎస్ఆర్ సభ్యుడిగా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని, ఆయన మృతి ఫౌండేషన్‌కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు రాజారాం, పర్వయ్య, గోవర్ధన్, శ్రీనివాస్, అఫ్రోజ్, సాయిలు, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, జనవరి 19 : మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన బొజ్జ సుధాకర్ (46)మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లావణ్య ఆదివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఆరేండ్లుగా సుధాకర్ అనారోగ్యంతో బాధ పడుతూ, మద్యానికి బానిసై తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన మీసేవ కేంద్రం

నస్రుల్లాబాద్, జనవరి 19 : బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో మీ సేవ కేంద్రం కాలిపోయినట్లు కేంద్రం నిర్వాహకుడు షేక్ అజీమ్ తెలిపాడు. ఆదివారం రాత్రి మీ సేవ కేంద్రంలో మంటలు రావడంతో పక్కన ఉన్న దుకాణం యజమాని పొగలు వస్తున్నాయని ఫోన్ చేసి తెలుపడంతో అజీమ్ వచ్చి షాపు తెరిచి చూడగా షాపులో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయని తెలిపాడు. సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

# నిరుపయోగంగా తాండూర్ బస్టాండ్



తాండూర్ ఎక్స్‌రోడ్‌లో నిరుపయోగంగా మారిన బస్టాండ్



బస్టాండ్‌లో పెరిగిన పాముల పుట్ట

- చోరీకి గురైన బండలు.. పెరిగిన పుట్ట
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

నాగిరెడ్డిపేట, జనవరి 19 : మండలంలోని తాండూర్, అక్కంపల్లి ఎక్స్‌రోడ్డులో ఉన్న బస్టాండ్ ఆలనాపాలన లేక వృథాగా మారి శిథిలావస్థకు చేరింది. ఆర్టీసీ, గ్రామస్తుల సహకారంతో తాండూర్, కిచ్చన్నపేట, అక్కంపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న ఎక్స్‌రోడ్‌పై బస్టాండ్‌ను నిర్మించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో బస్టాండ్‌లోని గద్దెలపై ఏర్పాటు చేసిన బండలు చోరీ అయ్యాయి. బస్టాండ్ లోపల పుట్ట పెరిగి పాములకు నిలయంగా మారింది. దీంతో గ్రామస్తులు రోడ్డుపక్కన చెట్లకింద కూర్చుంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## 'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆశ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్

బాన్సువాడ టౌన్, జనవరి 19 : ఈ నెల 21న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఆశ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ పిలుపునిచ్చారు. బాన్సువాడ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 21న 10 కిలోమీటర్ల పాదయాత్రతో కలెక్టర్‌కు వెళ్లాలని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని 22 మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆశ వర్కర్లుకు రూ.18 వేల కనీస వేతనం వెంటనే చెల్లించడంతోపాటు ఇతరాత్ర డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ సభ్యులు లావణ్య, రజిత, పద్మ, వరలక్ష్మి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంప శశాంక్

కామారెడ్డి, జనవరి 19 : ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంప శశాంక్ అన్నారు. మండలంలోని క్యాసంపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం కేసీఆర్, గంప గోవర్ధన్ నాయకత్వంలో పోరాటం చేస్తామని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం కోసం బీఆర్ఎస్ యువజన విభాగం అధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి కావాల్సిన చర్యల్ని ముమ్మరం చేసి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, కామారెడ్డి, మాచారెడ్డి మండలాల అధ్యక్షులు అనిల్‌రెడ్డి, లష్కర్ నాయక్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, పరశురామ్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, సమీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేత కొత్తాబాది

బాన్సువాడ రూరల్, జనవరి 19 : బాన్సువాడ మండలం కొత్తాబాది గ్రామ పంచాయతీ పరిధిలోని సంతోష్ నగర్ తండాలో నిర్వహించిన కొత్తాబాది ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నీ విజేత కొత్తాబాది జట్టు నిలిచింది. ఆదివారం బాన్సువాడ – కొత్తాబాది జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తాబాది జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు రూ.25,555 నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన బాన్సు వాడ జట్టుకు రూ.15,555 నగదుతోపాటు ట్రోఫీని అందజేశా రు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకిత, నాయకులు ఎజాస్, మధుసూదన్‌రెడ్డి, సాయిరెడ్డి, సాయాగౌడ్, మన్సూర్, షాదుల్, జీవన్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## పిట్లంలో రక్తదాన శిబిరం

పెద్ద కొడప్‌గల్, జనవరి 19 : పిట్లం మండల కేంద్రంలో సద్గురు నరేంద్రాచార్య మహరాజ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు రక్తదానం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, రాంరెడ్డి, హన్మంత్, అనిత, వైద్య సిబ్బంది శ్రీలత, సురేశ్, అంజి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి

ఎడపల్లి, జనవరి 19: మండల కేంద్రంలో కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన మచ్చర్ల రజిని (48) ఎడపల్లి గ్రామానికి తన బంధువైన అక్క సిరిసెట్టి లక్ష్మి మనవడి పుట్టిన రోజు వేడుకకు శనివారం హాజరైంది. ఆదివారం జిల్లా కేంద్రానికి బయల్దేరేందుకు ఎడపల్లి రెక్వెస్ట్ బస్టాప్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్నది. బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి అక్క సిరిసెట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, జనవరి 19 : బీబీపేట మండలంలోని జనగామ రోడ్డు వద్ద ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు ఏఎస్సై మదుసూధన్‌రావు పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణపత్రాలు లేని 22 మంది వాహనదారులకు జరిమానా విధించారు.

## కల్యాణ మండపానికి విరాళం

భిక్కనూరు, జనవరి 19 : భిక్కనూరులో నిర్మించనున్న ముదిరాజ్ కల్యాణమండపానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని మాజీ సర్పంచ్ తునికి వేణు అందజేశారు. మండల కేంద్రంలో నూతంగా ముదిరాజ్ సంఘ సభ్యులు నిర్మించనున్న కల్యాణ మండపానికి భిక్కనూరు మాజీ సర్పంచ్ తునికి వేణు గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.ఐదు లక్షల నగదును సంఘ అధ్యక్షుడికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాజీ సర్పంచ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ గంగళ భూమయ్య, అడ్వకేట్లు నంద రమేశ్, భిక్షపతి, నర్సింహులు, ఆంనేయులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో సమీక్షా సమావేశం

బాన్సువాడ టౌన్, జనవరి 19 : రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు వార్డుల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కమిషనర్ శ్రీహరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో నూతనంగా వచ్చిన రేషన్ కార్డుల జాబితాను చదివి వినిపించడం, రేషన్ కార్డులు రాని వారికి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రతి వార్డు అధికారులు, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియొగం చేసుకోవాలని సూచించారు.

## పేకాటస్థావరంపై దాడి

రాజంపేట్, జనవరి 19 : మండలంలోని బస్వన్నపల్లి, ఆర్గొండ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.58,350 నగదుతోపాటు ఏడు సెల్‌పోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు

## చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

బిచ్కుంద, జనవరి19 : దొంగతనం చేసిన వ్యక్తిని రిమాండ్ చేశామని ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఈరవ్వ ఈ నెల 4న నిజాంసాగర్‌కు బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉన్నది. బీరువాలో ఉన్న బంగారం, వెండి, రూ. 20 వేల నగదు దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణలో భాగంగా గ్రామంలోని ఈరవ్వ ఇంటి ముందున్న చాకలి మారుతిని విచారించగా, నేరం ఒప్పుకున్నాడు. దొంగిలించిన బంగారం, వెండి, నగదును రికవరీ చేశారు. వాటి మొత్తం విలువ రూ. 38 వేలు ఉంటుంది. మారుతిని అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## 23న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

బిచ్కుంద, జనవరి19: మండల కేంద్రంలోని ఈ నెల 23న రైతు వేదికలో జుక్కల్ నియోజక వర్గంలోని అన్ని మండలాలకు చెందిన దివ్యాంగులకు దివ్యాంగుల సంస్థ నుంచి పరికరాలు పంపిణీ చేస్తారని ఎంపీడీవో గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌తో పాటు యూడీఐడీ కార్డు కలిగి ఉండాలన్నారు. కార్డు లేని వారు ఆన్‌లైన్ సెంటర్‌లో నమోదు చేసుకొని రిసిప్ట్ తీసుకొని రావాలని సూచించారు.

**22న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం..**

లింగంపేట(ఎల్లారెడ్డిరూరల్), జనవరి19: ఎల్లారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఈనెల 22వ తేదీన దివ్యాంగుల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు సదరణ్ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వైకల్యం కనిపించే విధంగా ఫొటోలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రసీదు కచ్చితంగా తీసుకుని శిబిరానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## వ్యక్తి హత్య



రక్తం మడుగులో రవి మృతదేహం

రామారెడ్డి, జనవరి19: మండలంలోని అన్నారం గ్రామంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొక్కిలి రవి (41) శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు పదునైన ఆయుధంతో పొడిచి హత్య చేశారు. రవి భార్య రంజిత ఇచ్చిన ఫిర్యా దు మేరకు రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని కామారెడ్డి ఏ ఎస్పీ చైతన్యా రెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లింగంపేట, జనవరి 19: మండలంలోని మెంగారం, మోతె గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో లింగంపేట సహకార సంఘం వైస్ చైర్మన్ మాకం రాములు, మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి, అన్నం సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, రాములు, శ్రీను, గణేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

# ఆరేండ్లుగా వృథాగా పాఠశాల గదులు

- తుప్పు పడుతున్న విలువైన సామగ్రి
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న అక్కంపల్లి గ్రామస్తులు



అక్కంపల్లిలో వృథాగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల గదులు



చెట్లు, పిచ్చి మొక్కల మధ్య వంటగది

నాగిరెడ్డిపేట, జనవరి19: మండలంలోని అక్కంపల్లిలో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఉర్దూ మీడియం పాఠశాల భవనాలు ఆరేండ్లుగా వృథాగా మారాయి. విలువైన వస్తువులు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. పాఠశాల గదులు, ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి భూత్ బంగ్లాలుగా దర్శనమిస్తున్నాయి. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని కళ్లకు కడుతున్నాయి. పాత తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిచ్చన్నపేటలో గ్రామంలో గతంలో ఉర్దూ మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో 2017లో పాఠశాలలను మూసి వేశారు. దీంతో నాటి నుంచి నేటి వరకు పాఠశాల గదులకు తాళాలు వేసి వృథాగా వదిలేశారు. నూతనంగా నిర్మించిన భవనం, గదులు, విలువైన సామగ్రి తుప్పు పడుతోంది. అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'కలిసిగట్టుగా ఉంటేనే.. హక్కులు సాధించుకోగలం'



నాగిరెడ్డిపేట మండల ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్

నాగిరెడ్డిపేట, జనవరి19: ఆర్యవైశ్యులు సమాజంలో మంచి గుర్తింపు ఉందని, దానికి ఐకమత్యం తోడైతే తమ హక్కులను సాధించుకోవడం కష్టమైన పని కాదని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపములో ఏర్పాటు చేసిన మండల నూతన ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఎవరికి అన్యాయం చేయరని, మంచితనానికి మారుపేరుగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ ఐకమత్యం లేకపోవడం వల్లే ఎన్ని ఇబ్బందులు ఉన్నా బయటకు రాలేపోతున్నారన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆర్యవైశ్య సంఘం బలంగా ఉన్నదన్నారు. దానికి జిల్లా, నియోజకవర్గ, మండల మహిళా ఆర్యవైశ్య సంఘాలను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన మండల సంఘ అధ్యక్షుడు సతీశ్‌కుమార్‌గు ప్తా, ఉపాధ్యక్షుడు శివకుమార్‌గుప్తా, సత్యనారాయణ గుప్తా, ప్రధాన కార్యదర్శి దిగంబర్‌గుప్తా, సహాయ కార్యదర్శులు సంతోష్‌గుప్తా, సందీప్‌గుప్తా, మహిళా మండల అధ్యక్షురాలు భూపతి కవిత, మండల కార్యదర్శి కుంచారపు స్వప్న, కార్యవర్గ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. వారిని శాలువాలతో సన్మానించారు. సంఘ అభివృద్ధికి నిరంతరం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యపు సుదర్శన్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కోశాధికారి మోటూరి రాజులు, డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఇన్‌చార్జి విరేశ లింగంగుప్తా, జిల్లా మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు సిద్ధి విజయ, ప్రధాన కార్యదర్శి పడిగెల రమాదేవి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, ఆయా గ్రామాల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలి

రామారెడ్డి, జనవరి19 : కామారెడ్డి పట్టణ విస్తరణను ఉద్దేశించి చేసిన మాస్టర్‌ప్లాన్‌ను వెంటనే రద్దుచేయాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సదాశివనగర్ మండలం అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలో ఆదివారం మాస్టర్ ప్లాన్ బాధితులు సమావేశమై మాట్లాడారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌లో చూపించిన గ్రీన్ జోన్, ఇండస్ట్రియల్ జోన్‌లలో వ్యవసాయ భూములు చేర్చడాన్ని నిరసిస్తూ ఏడాది కాలంగా ఎనిమిది విలీన గ్రామాల రైతులు ఆందోళనచేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రద్దు చేసినట్లు ప్రకటించినా ఇప్పటి వరకూ సంబంధిత గెజిట్ మాత్రం విడుదల కాలేదన్నారు. కామారెడ్డి –ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సమావేశంలో నిర్ణయించినట్లు రైతులు పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్లు జీవోను జారీచేయాలని, లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు.



మాస్టర్ ప్లాన్ రద్దు విషయమై సమావేశంలో చర్చిస్తున్న రైతులు

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

బిచ్కుంద, జనవరి 19 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పుల్కల్ మంజీర పరీవాహక ప్రాంతం నుంచి ఆదివారం ఉదయం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తు న్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు న మోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**ఇసుక ట్రాక్టర్ల పట్టివేత..**

మద్నూర్, జనవరి 19 : డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామ సమపంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమాదు చేసినట్లు ఎస్సై విజయ్‌కొండ ఆదివారం తెలిపారు. కుర్లా మంజీరా నది నుంచి అక్రమంగా తీసుకువస్తుండగా పట్టుకున్నామన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను తరలిస్తే కేసు నమోదుతోపాటు చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుట్కా పట్టుకున్నామని తెలిపారు. శ్రీకాంత్ అనే వ్యక్తి సుమారు లక్షా ఎనబై వేల రూపాయల విలువైన గుట్కాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

## డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు వైద్యులు

లింగంపేట, జనవరి 19: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేరిట మండల కేంద్రంలో డబ్బులు వసూలుకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రైవేటు వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా లింగపూర్ గ్రామంలోని పల్లె దవఖానాలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న సామల బాలకృష్ణ ఇద్దరు ప్రైవేటు వైద్యులను బెదిరించి 25వేల రూపాయలు వసూలు చేశాడు. వైద్య శాఖలో విధులు నిర్వహిస్తూ డబ్బుల వసూలుకు పాల్పడిన బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్ వైద్యులకు హామీ ఇచ్చారు.

## సన్నాహక సదస్సును విజయవంతం చేయాలి

బిచ్కుంద, జనవరి19 : ఈ నెల 25న కామారెడ్డిలో నిర్వహించే సన్నాహక సదస్సుకు మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ మాదిగ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేయి గొంతులు.. లక్ష డప్పులు క్యాక్రమం విజయవంతం చేయడానికి అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న సన్నాహక సదస్సులో భాగంగా ఈ నెల 25న కామారెడ్డి జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, జిల్లాలోని మాదిగలు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకుడు కొత్తోల్ల యాదగిరి, మాదిగ మహిళా విభాగం నాయకురాలు సట్టిగారి లక్ష్మి, బాణపురం లావణ్య, శైలేశ్, గోనె సురేశ్, గోనె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.